యూనిట్
IV

# 13. భూమి పుత్రుడు

- దువ్వూరి రామిరెడ్డి

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

మనిషి జీవించడానికి ముఖ్యంగా కావలసినవి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, నివసించడానికి ఇల్లు- ఈ మూడు అవసరాలు తీరాలంటే ప్రకృతిలోని మొక్కలు, చెట్లే ఆధారం. అవి ఎక్కడెక్కడో చెల్లాచెదురుగా ఉంటే వాటినుంచి తమ అవసరాలు తీర్చుకొనేవాడు ఆదిమానవుడు. కాలక్రమేణ మానవ అవసరాలు ఎక్కువ కావడంతో, ఆయా మొక్కలను, చెట్లను ప్రత్యేకంగా పెంచడం మొదలుపెట్టాడు. దానికే వ్యవసాయం అని పేరు పెట్టాడు. రాను రాను ఆ వ్యవసాయం ప్రధాన వృత్తిగా మారింది. దాని ఆధారంగా మానవుడి నాగరికత కూడా పెరిగింది.

### ప్రశ్నలు

1. మనిషికి కావలసిన ముఖ్యావసరాలు ఏవి?
2. ఆదిమానవుడు మొదట్లో తన అవసరాలను ఎలా తీర్చుకొనేవాడు?
3. వ్యవసాయం ఎలా మొదలయింది?
4. వ్యవసాయం వలన ఏమి పెరిగింది?
5. వ్యవసాయం చేసేవారిని ఏమని పిలుస్తారు?

**ఉద్దేశం :**

తొలకరితో వ్యవసాయక్షేత్రంలో ప్రవేశించి విత్తువిత్తి, కలుపుతీసి, మందుచల్లి, నీరుగట్టి, పసిబిడ్డలా పైరును పోషించుకుంటాడు. పంటనూర్చి కళ్ళాల నుండి ధాన్యాన్ని ఇంటికి చేర్చే రైతు మనకే కాక పశుపక్ష్యాదులకు కూడా ఆహారాన్ని ప్రసాదిస్తున్నాడు. అలాంటి రైతును గురించి తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

ప్రస్తుత పాఠం దువ్వూరిరామిరెడ్డి గారు రాసిన "కృషీవలుడు" అనే కావ్యం లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.


© SCERT not to be republished

*చ॥ మనుజసమాజనిర్మితి సమంబుగ నీకొక ముఖ్యమైన వృ
త్తి నియత, మట్టి ధార్మికవిధిం జిరకాలము గౌరవంబుతో
మనిచిరి నీ పితామహుల మాంద్యసుశీలురు సర్వవృత్తిపా
వన కృషిజీవనైక పరిపాలన లోకహితార్థకాంక్షులై 1.

తే॥ శ్రమలు లేకయె ఫలములు దుముకబోవు
పిండికొలదియె రొట్టె; యోపిన విధాన
కష్టపడుము కృషీవలా, కలుగు సుఖము
ఉత్తయాసలకన్న మే లుద్యమంబు 2.

*తే॥ నేలనూతుల కుగ్గాలు నిలుపువారు,
బోడితలకు మోకాళ్ళకు ముడులువెట్టు
వారు, చిటికెల పందిళ్ళు పన్నువారు
నిన్ను బోలరు, తమ్ముడా, యెన్నడైన 3

తే॥ సైరికా, నీవు భారతక్ష్మాతలాత్మ
గౌరవ పవిత్రమూర్తివి! శూరమణివి!
ధారుణీపతి పాలనదండ మెపుదు
నీహలంబు కన్నను బ్రార్థనీయమగునె? 4



© SCERT not to be republished

తే॥ దైనికావశ్యకమ్ముల దాటిపోవ
వెగురఁ ఱెక్కలురాని నీ యిచ్చలెపుడు;
పైరుపచ్చలె యవధిగా బ్రాకుచుండు
నీ విచారము, నూహయు, నిపుణతయును 5

*తే॥ ప్రొద్దువొడిచిన దాదిగా బ్రొద్దుగ్రుంకు
వఱకు కష్టింతువేగాని యిరుగుపొరుగు
వారి సంపదకై యీసు గూరబోవ
వెంత నిర్మలమోయి, నీహృదయకళిక! 6

తే॥ ఉండి తిన్నను లేక పస్తున్నగాని
యాసచేయవు పరుల కష్టార్జితంబు!
నాకలెత్తగ నీపంచ కరుగు నతిథి
తినక, త్రావక, పోయిన దినములేదు 7

తే॥ కృషి సకల పరిశ్రమలకు కీలుచీల;
సత్పరిశ్రమ వాణిజ్యసాధనంబు,
అఖిల వాణిజ్యములు సిరికాటపట్లు
సిరియె భోగోపలబ్ధికి జీవగఱ్ఱ 8

తే॥ కావున కృషీవలా, నీవె కారణమవు
సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు;
ఫల మనుభవించువారలు పరులు; నీకు
కట్ట కుడువను కఱవె యెక్కాలమందు! 9

*మ॥ ఫలము ల్మెక్కెడివారు తత్ఫల రసాస్వాదక్రియాలోలురై
పలుమా అమ్మధురత్వము న్నుతుల సంభావింతురేగాని, త
త్ఫల హేతుక్రమవృక్షముం దలపరెవ్వారైన, నట్లే రమా
కలితు ల్భోగములన్ భుజించుచు నినుం గన్నెత్తియుంజూతురే? 10




© SCERT not to be republished

ఉ॥ అట్టి కృతఘ్నులన్ మనమునందు దలంపక సేద్యనాద్యపున్
ఘట్టన నస్థిపంజరముగా తనువెండినగాని, వర్షముల్
పట్టినగాని, క్షామములు వచ్చినగాని శరీరసత్త్వమే
పట్టుగ స్వశ్రమార్జితము పట్టెడు నన్నము దిందు వెప్పుడున్! 11

తే॥ ఓ కృషీవల! నీవు కష్టోత్కటంపు
దుర్భరావస్థ యందె తోడ్పోవుడగ
నెవరు శాసించువారు, నీకేమికొదవ?
ఆత్మవిజ్ఞానమయముగా నలవరింపు 12



తే॥ జీవనస్పర్ధ సామాన్య చేష్టయైన
కాలమున వ్యక్తివాద మగ్రత వహించు
సత్త్వవిరహితు దన్యభోజ్యత నశించు
నర్హజీవియె యంతరాయముల దాటు 13

తే॥ కాన జీవనసంగ్రామ కార్యమందు
విజయి వగుటకు శౌర్యంబు, విద్య, బుద్ధి,
సత్యసంధత, యాత్మవిశ్వాస మనెడు
నాయుధంబుల విడవకు హాలికవర్య 14

© SCERT not to be republished

**కవి పరిచయం**



శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు 09.11.1895న నెల్లూరు జిల్లాలో జన్మించారు. ఈయన 19వ ఏట సాహిత్యరంగంలో ప్రవేశించి నలజారమ్మ, వనకుమారి, కృషీవలుడు, జలదాంగన, యువకస్వప్నము, కడపటివీడ్కోలు, పానశాల-కావ్యాలను, నక్షత్రశాల-నైవేద్యము, భగ్నహృదయము, పరిశిష్టము, ప్రథమకవిత్వము అనే ఖండకావ్యాలను రచించారు. సంస్కృతం తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచి, లాటిన్, జర్మన్, బెంగాలీ, పర్షియన్, ఉర్దూ, తమిళభాషలలో పండితులు. ఈయన 11.09.1947 నాడు కన్నుమూశారు. వీరికి 'కవికోకిల' అను బిరుదు కలదు.

దువ్వూరివారి రచనాశైలి సరళసుందరంగా వుంటుంది. పాతకొత్తల, ప్రాక్పశ్చిమాల కలయికతో అందాన్ని సంతరించుకున్నది. విశ్వశాంతి, దేశభక్తి, మానవతావాదం, అభ్యుదయం ఈయన రచనలలో ప్రస్ఫుటంగా కనిపిస్తూ మనకు మేలుకొలుపు పాడుతూ ఉంటాయి.

**భావాలు**

1. మానవసమాజ నిర్మాణంలో భాగంగా నీకొక ముఖ్యమైన వృత్తిని అప్పగించడం జరిగింది. అది వ్యవసాయ వృత్తి. వృత్తులకెల్లా ఇది ఉత్తమమైనది. ప్రపంచానికి మేలు చేకూర్చడానికి నీపూర్వికులు ధర్మబుద్ధితో, చాలా గౌరవంతో ఈ వృత్తిని నిర్వహిస్తూ వచ్చారు.

2. కృషీవలా! శ్రమ చేయకుండా ఫలితాలు రావు. పిండికొద్దీ రొట్టె కదా! శక్తివంచన లేకుండా కష్టపడు. నీకు సుఖం కలుగుతుంది. కేవలం ఉత్తఆశలతో జీవించడంకన్నా ప్రయత్నం చేయడం మంచిది.

3. తమ్ముడా! లోకంలో కొందరు చిత్రంగా ఉంటారు. వీరిలో కొందరు చిన్నతాడు కట్టిన చిన్నచెంబుతో నేలనూతిలో నీళ్ళు తోడేవారు. కొందరు తలకు, మోకాలికీ ముడిపెట్టేవారు. ఇంకొందరు చిటికెలతో పందిళ్ళు అల్లేవారు. (అంటే వీరంతా కేవలం మాటల చమత్కారంతో అరచేతిలో స్వర్గం చూపిస్తారు). కాని చేతలతో సమాజసేవ చేస్తున్న నీకు వీరెవ్వరూ సాటిరారు.

4. హాలికుడా! నీవు భారతదేశ ఆత్మగౌరవాన్ని ప్రకటించే పవిత్ర రూపానివి. శూరులలో శ్రేష్ఠుడివి. రాజు చేతిలోని ధర్మదండం కన్నా నీచేతిలోని నాగలి గొప్పది. రాజదండంలో దండించే గుణం, నీ హలంలో పండించే గుణం ఉన్నది.

5. నిత్యావసరాలు గడచిపోతే చాలని చూస్తావే తప్ప అంతకుమించిన ఆశలు నీకు లేవు. నీ ఊహలను, ఆలోచనలను, నైపుణ్యాలన్నీ పంటలను పండించడానికే వినియోగిస్తావు.

6. దినమంతా కష్టపడతావే గాని, పక్కవారి సంపదల గూర్చి అసూయ పడవు. నీ మనసెంత స్వచ్ఛమైనది?

7 నీవు తిన్నా, తినకున్నా ఇతరుల సంపదలకు మాత్రం ఎప్పుడూ ఆశపడవు. ఆకలితో నీ ఇంటికి వచ్చిన అతిథి కడుపునిండా తిని తృప్తిగా వెళతాడు.

8. వ్యవసాయమే పరిశ్రమలన్నింటికీ మూలం. పరిశ్రమలు వ్యాపారానికి సహాయపడతాయి. వ్యాపారం వల్ల సంపద కలుగుతుంది. సంపదవల్ల సుఖం లభిస్తుంది.

9. ఓ హాలికుడా! సమాజం సుఖసంతోషాలతో ఉండడానికి నీవే కారణం. నీ కష్టఫలితాన్ని ఇతరులు అనుభవించి సుఖపడుతున్నారు. నీకు మాత్రం తిండికీ, బట్టకూ ఎప్పుడూ కొరతే.

10. పండ్లను తినేవారు వాటి తియ్యదనాన్ని పొగడుతూ తింటారే కాని ఆ పండ్లనిచ్చిన చెట్టును గూర్చి ఎప్పుడైనా ఆలోచిస్తారా? అలాగే నీ కష్టంతో భోగభాగ్యాలను అనుభవించే సంపన్నులు నిన్ను కన్నెత్తి అయినా చూడరు కదా!

11. చేసినమేలు మరచే అలాంటివారిని నీవు అసలు పట్టించుకోవు. వ్యవసాయాన్ని చేయడంలో నీ శరీరం ఎముకలగూడుగా మారినా వానలు ముంచెత్తినా కరువు పీడించినా వాటిని లెక్కచేయవు. కాయకష్టాన్నే నమ్ముకున్నవాడివి. నీ శరీరశ్రమతో లభించిన పట్టెడన్నమైనాసరే దాన్నే తింటావు.

12. కష్టాలు కన్నీళ్ళలో కూరుకుపోయిన నిన్ను శాసించేదెవరు? నీకేమి తక్కువ? నీ గొప్పదనాన్ని నీవు తెలుసుకో.

13. పోటీతత్త్వం సహజమే. కాని అది ఆయా వ్యక్తులను బట్టి ఉంటుంది. ఏ ప్రయత్నమూ పని చేయనివాడు ఇతరులపై ఆధారపడి జీవిస్తూ నాశనమవుతాడు. కాని శ్రమను నమ్ముకున్నవాడు ఎలాంటి అడ్డంకులనైనా దాటగలడు.

14. కాబట్టి ఓ రైతు శ్రేష్ఠుడా! జీవితమనే యుద్ధంలో విజయం పొందడానికి 'శక్తి, చదువు, తెలివి, సత్యము,నీపై నీకు నమ్మకము' అనే ఆయుధాలను ధరించి ముందుకు నడువు.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I అవగాహన- ప్రతిస్పందన

**అ) కింది అంశాల గురించి మాట్లాడండి.**

1 పద్యాలను భావయుక్తంగా పాడండి.

2 ఈ పాఠానికి 'భూమిపుత్రుడు' అనే శీర్షిక తగినట్లు ఉన్నదా? ఎందుకు? చర్చించండి.

**ఆ) కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా ఐదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1 తన పంచనచేరిన అతిథిని రైతు ఎలా ఆదరిస్తున్నాడు?

2 కవి రైతును ఏమి తెలుసుకోమంటున్నాడు?

3 ఈ పాఠంలోని జాతీయాలను, సామెతలను గుర్తించి వివరించండి.

4 పాఠం ఆధారంగా రైతు గుణగణాలను రామిరెడ్డిగారు ఏయే విశేషణాలతో వర్ణించాడో రాయండి.

**ఇ) పాఠం ఆధారంగా కిందిపట్టికను పూరించండి.**

| క్ర.సం | అంశం | చేపట్టిన పని/ఫలితం |
|---|---|---|
| 1 | సమాజనిర్మాణం, సంక్షేమంకోసం | |
| 2. | శ్రమచేయడంవల్ల | |
| 3. | పరిశ్రమలకు ప్రధానవనరు | |
| 4. | విజయం సాధించాలంటే | |

**ఈ) కింది పేరాను చదవండి. కారణాలు రాయండి.**

'ఏటి కేతంపట్టి ఎయి పుట్లు పండించి ఎన్నడూ మెతుకెరుగరన్నా! నేను గంజిలో మెతుకెరుగనన్నా!' అని ఒక కవి పాటరూపంలో రైతు దుస్థితిని తెలియజేశాడు. వ్యవసాయానికి కావలసిన ముఖ్యమైన వనరులు భూమి, నీరు. దానితోపాటు ఎరువులు. వాతావరణపరిస్థితులు అనుకూలించడం కూడా అవసరమే. జనాభా పెరగకముందు పై వనరులన్నీ పుష్కలంగా ఉండేవి. రానురాను జనాభా పెరిగిపోయింది. మానవుడి అవసరాలూ పెరిగిపోయాయి. వీటన్నిటికీ భూమే ఆధారం. ఇతర అవసరాలకోసం భూమి వినియోగం ఎక్కువకావడం లాంటి పరిస్థితులవల్లనే వ్యవసాయరంగానికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులు ఎన్నో ఇబ్బందులను, సమస్యలను ఎదుర్కొంటున్నారు.

వ్యవసాయ రంగానికి ఉన్న వనరుల కొరత, ఇబ్బందుల వల్ల దిగుబడి ఆశాజనకంగా లేదు.

1. కవి పాట రాయడానికి కారణం : ______________________
2. వ్యవసాయ వనరులు తగ్గడానికి కారణం : ______________________
3. వ్యవసాయ రంగానికి ఇబ్బందులకు కారణం : ______________________
4. దిగుబడి తగ్గడానికి కారణం : ______________________



© SCERT not to be republished

## II వ్యక్తీకరణ- సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సొంతమాటల్లో జవాబులు రాయండి.**

1. 'సుఖాల కన్నిటికీ ధనమే మూలం' అని కవి ఎందుకన్నాడు?
2. "పిండికొద్దీ రొట్టె" అనడంలో కవి ఉద్దేశమేమి?
3. "రైతుహృదయం నిర్మలమైనది" దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?
4. 'పాలనా దండం' కంటే 'హలం' గొప్పదని కవి ఎందుకన్నాడు?

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాల్లో సొంతమాటల్లో జవాబులు రాయండి.**

1. కర్షకుని గొప్పతనాన్ని గురించి కవి ఏమని చెప్పాడు?
2. పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి.

**ఇ) సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.**

నేడు గ్రామాలలో వ్యవసాయంచేసేవారు తగ్గుతున్నారు. భవిష్యత్తులో పంటలు పండించేవారు కరువైతే, ఆహారం దొరకడం గగనమవుతుంది. కోటీశ్వరుడైనా ఆకలికి అన్నమే తింటాడు కాని బంగారాన్ని తినడు కదా! కాబట్టి వ్యవసాయం చేసే రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, సాగుకవసరమైన ప్రత్యేక ఋణ సౌకర్యం సకాలంలో అందించే బాధ్యత చేపట్టాలని వ్యవసాయాధికారికి లేఖ రాయండి.

**ఈ) ప్రశంసాపూర్వకంగా సమాధానం రాయండి.**

రైతుకృషివల్లనే మనకు ఆహారం లభిస్తున్నది కదా! రామయ్య ఆదర్శ రైతు. ఆధునిక పద్ధతులతో, సేంద్రియ ఎరువులతోనే అధికదిగుబడిని సాధించాడు. వ్యవసాయశాఖ తరఫున ఆయన్ను అభినందించాలనుకున్నారు. ఈ అభినందనసభ కోసం రామయ్యగారిని ప్రశంసిస్తూ అభినందనపత్రాన్ని తయారుచేయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది ప్రకృతి వికృతులను జతపరచండి**

| | | | |
|---|---|---|---|
| 1. | ఈర్ష్య | ( ) | (అ) కర్జం |
| 2. | విజ్ఞానం | ( ) | (ఆ) సంగరం |
| 3. | సుఖం | ( ) | (ఇ) ఆన |
| 4. | కార్యం | ( ) | (ఈ) ఈసు |
| 5. | ఆజ్ఞ | ( ) | (ఉ) సుగం |
| 6. | సంగ్రామం | ( ) | (ఊ) విన్నాణం |

© SCERT not to be republished

**ఆ) కిందివాక్యాలను అవగాహన చేసుకొని గీతగీసిన పదాలకు నానార్థాలు రాయండి.**

1. <u>ఉచితం</u>కదా! అని దేన్నీవృథా చేయడం <u>ఉచితం</u> కాదు.
2. పండించిన <u>ఫలానికి</u> ధర ఉన్నప్పుడే <u>రైతు</u> <u>ఫలం</u> పొందగలడు.
3. నేడు <u>ధర</u>కు విపరీతంగా <u>ధర</u> పెరిగిపోయింది.
4. ఆధునికకాలంలో <u>కృషి</u>చేయడానికి ఎవరూ <u>కృషి</u> చేయడంలేదు.
5. <u>వర్షం</u> లేక ఈ <u>వర్షం</u> జలాశయాలు నిండలేదు.

**ఇ) కింది పదాలకు సమానార్థక పదాలను రాయండి. వాటిని సొంత వాక్యాలలో ఉపయోగించండి.**

ఉదా : మహిళ = స్త్రీ, ఉవిద, నారి ; <u>ఉవిద</u> తన హక్కులకోసం పోరాటంలో భాగంగా <u>నారీ</u> లోకాన్ని చైతన్యపరచి <u>మహిళ</u> అంటే ఏమిటో నిరూపించుకుంటున్నది.

1. హలం 2. హాలికుడు 3.పొద్దు 4. వృక్షం 5. సత్యం 6. సంగ్రామం 7. అతిథి 8. సౌఖ్యం 9. నుయ్యి

## వ్యాకరణం

**అ) కింది సంధులకు ఉదాహరణలు రాసి, సూత్రాలు కూడా రాయండి.**

1. వృద్ధిసంధి, 2. త్రికసంధి, 3. గుణసంధి, 4. అత్వసంధి, 5. ఇత్వసంధి

**ఆ) కింది వాటికి విగ్రహ వాక్యాలు రాసి, సమాసాలను గుర్తించండి.**

1.అమాంద్యం, 2. సచ్ఛీలురు 3. చిటికెల పందిళ్ళు 4. భారతక్ష్మాతలం 5.హృదయకళిక

**ఇ) ఛందస్సు : - తేటగీతి**

తేటగీతికి - 1. నాలుగు పాదాలుంటాయి.

2. ప్రతిపాదానికీ ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలూ, రెండు సూర్యగణాలు వరుసగా ఉంటాయి.
3. నాలుగోగణం మొదటిఅక్షరం యతిస్థానం. ప్రాసయతి చెల్లుతుంది.
4. ప్రాసనియమం లేదు.

ఉదా:-

| న | భ | నల | న | హ |
|---|---|---|---|---|
| I I I | U I I | I I I I | I I I | U I |
| శ్ర మ లు | లే క యె | ఫలములు | దుముక | బోవు |
| సూర్యగణం | ఇంద్రగణం | ఇంద్రగణం | సూ.గ. | సూ.గ. |

అలాగే మీరు ఈ పద్యానికి సంబంధించిన మిగతా పాదాలకు గణవిభజన చేయండి.

**ప్రాజెక్టు పని**

మీ గ్రామంలోని మీకు తెలిసిన ఒక ఆదర్శరైతువద్దకు లేదా వ్యవసాయ అధికారి వద్దకు వెళ్ళి ఆధునికపద్ధతుల ద్వారా అధికోత్పత్తిని ఎలా సాధించవచ్చో వివరాలు సేకరించండి. తరగతిగదిలో చదివి ప్రదర్శించండి.

**కాయకమే కైలాసం**
**(శ్రమ జీవనం కైలాసంతో సమానం).**
**- బసవేశ్వరుడు.**

© SCERT not to be republished